సాక్షి
రంగారెడ్డి

బుధవారం । 25 । డిసెంబర్ । 2024



ధ్యానంతోనే జ్ఞానం

ధ్యానంతోనే జ్ఞానం కలుగుతుందని పీఎస్ఎస్ఎం సభ్యురాలు, ధ్యాన గురువు పరిణీత పత్రి అన్నారు. 10లో▸

అక్రమ నిర్మాణాల తొలగింపు



మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ భూముల జోలికి వస్తే చర్యలు తప్పవని మండల రెవెన్యూ అధికారి గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. తోల్‌కట్ట రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 108లోని ఐదెకరాల ప్రభుత్వ భూమిలో కొందరు రాత్రికి రాత్రే ప్రీకాస్ట్ ప్రహరీలు, గదులు నిర్మించారని గ్రామస్తులు తెలపడంతో మంగళవారం ఉదయం రెవెన్యూ సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఇలాగే కూల్చివేస్తామని తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ తెలంగాణ కమిటీ సంఘీభావం తెలిపింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, జిల్లా అధ్యక్షుడు కేశవులు, ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి మాట్లాడారు. 18 ఏళ్ల నుంచి పాఠశాల విద్యాభివృద్ధి కోసం ఉన్నత విద్యార్హతలతో పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా ప్రభుత్వం శ్రమదోపిడీ చేస్తోందని మండిపడ్డారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటానికి మద్దతిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అదృష్టరావు, కరుణాకర్‌రెడ్డి, పట్నం కృష్ణ పాల్గొన్నారు.

క్రిస్మస్ కాంతులు

క్రిస్మస్ వేడుకలకు జిల్లాలోని చర్చిలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపేలా బొమ్మలను తీర్చిదిద్దారు. బుధవారం ప్రత్యేక ప్రార్థనల కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



కేశంపేట: విద్యుత్‌దీపాల వెలుగులో పాటిగడ్డలోని లూర్దుమాత దేవాలయం



కేశంపేట: లూర్దుమాత దేవాలయం లోపల..



షాబాద్: విద్యుత్ వెలుగుల్లో మరియాపురంలోని చర్చి



షాబాద్: మరియాపురం చర్చిలో ఏర్పాట్లు

అమిత్‌షా వ్యాఖ్యలపై ఫైర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కొంగరకలాన్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ మంత్రి పుష్పలీలతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీజేపీ ఏకంగా రాజ్యాంగాన్నే మార్చే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసిన అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోకి ర్యాలీగా వెళ్తుండగా జరిగిన తోపులాటలో మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల కిందపడిపోయారు. పార్టీ నాయకులు తనను అవమానానికి గురి చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి, చెల్లి కిందపడిపోతే ఇలాగే చేస్తారా అని వాపోయారు. తన ప్రాణం పోయినంత పనయ్యిందని, సంధ్య థియేటర్ ఘటన గుర్తుకు వచ్చిందని వాపోయారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ చైర్మన్ చిగురింత పారిజాత, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, పామెన భీంభరత్, మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ, మాజీ జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి కోర్టుకు లగచర్ల రైతులు

సిటీ కోర్టులు: లగచర్లలో అధికారులపై దాడి కేసులో బెయిల్‌పై బయటికి వచ్చిన రైతులు మంగళవారం నాంపల్లి కోర్టుకు వచ్చారు. బెయిల్‌పై బయటికి వచ్చిన తర్వాత మొదటి విచారణ నేపథ్యంలో నాంపల్లిలోని ప్రిన్సిపల్ ఏసీబీ కోర్టు ముందు హాజరయ్యారు. విచారణ చేపట్టిన ప్రిన్సిపల్ ఏసీబీ కోర్టు జడ్జి మహ్మద్ అఫ్రోజ్ అక్తర్ విచారణ మార్చి 28కి వాయిదా వేశారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కేశంపేట: పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని జీపీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. జీపీ కార్మికులతో కలిసి మంగళవారం ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి సమ్మె నోటీసు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో గ్రామ పంచాయతీ కార్మికులు తమ హక్కుల కోసం సమ్మె నిర్వహించగా, అప్పట్లో ప్రతి పక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాంచంద్రయ్య, పారేష, యాదయ్య, మల్లయ్య, మాసయ్య, పద్మ, బుచ్చమ్మ, రామస్వామి, రోశయ్య పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి సురేష్

షాద్‌నగర్‌రూరల్: ఉద్యానవన పంటల సాగుతో అధిక లాభాలు గడించొచ్చని ఉద్యాన శాఖ జిల్లా అధికారి సురేష్ అన్నారు. ఫరూఖ్‌నగర్‌లో సాగు చేసే ఉద్యానవన పంటలను మంగళవారం ఒడిశాకు చెందిన పలువురు అధికారులు, రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా సూక్ష్మ సేద్యం, బిందు సేద్యం, కూరగాయలు, మామిడి, నిలువు పద్ధతిలో టమాటా సాగు, పాలీహౌస్‌లను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహిస్తోందని, రైతులకు సబ్సిడీపై పనిముట్లను అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ డీజీఎం రామ్మోహన్‌రావు, అధికారులు హిమబిందు, మల్లారెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.





హాజరైన ధ్యానులు



జనగామ మైత్రేయ అకాడమీ విద్యార్థుల కరాటే విన్యాసం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న పరిణిత పత్రి



ధ్యానంతోనే జ్ఞానం

ధ్యానంతోనే జ్ఞానం కలుగుతుందని, ప్రతి ఒక్కరి జీవితం శ్వాసపైనే ఆధారపడి ఉంటుందని పీఎస్‌ఎస్‌ఎం సభ్యురాలు, ధ్యాన గురువు పరిణిత పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్‌లో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు మంగళవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. జనగామకు చెందిన మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం కళాకారుల నృత్యాలు, కరాటే విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేశ్ డి పటేల్, సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్ హాజరయ్యారు. – కడ్తాల్

హైకోర్టు ఆదేశాలు అమలు చేయండి

కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసిన ఫార్మాసిటీ భూ బాధితులు



కలెక్టర్‌ను కలిసిన అనంతరం కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ రైతులు

యాచారం: రాష్ట్ర హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టీజీఐఐసీ వద్ద ఉన్న భూములను రైతుల పేరు మీద చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తమ అంగీకారం లేకుండానే పట్టా భూములను ఫార్మాసిటీకి తీసుకుందని, భూ రికార్డులను టీజీఐఐసీ పేరు మీద మార్చేసిందని తెలిపారు. గతంలో పలుమార్లు కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, యాచారం తహసీల్దార్లను కలిసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి టీజీఐఐసీ పేరు మీద భూ రికార్డులను మళ్లీ రైతుల పేర్ల మీద మార్చాలని కోరారు. అనంతరం రైతులకు పంట రుణాలు, రైతుబంధు ఇతర ప్రయోజనాలు కల్పించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కవుల సరస్వతి, కానమోని గణేష్, నిరంజన్, మహిపాల్‌రెడ్డి, దేవోజీ, అనుసూయమ్మ, భగవంత్‌రెడ్డి, వెంకటేశ్, వినోద్‌రెడ్డి, అచ్చిరెడ్డి, రాజు, లింగం, నాగరాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడలో రూ.50 లక్షల నగలు చోరీ

పనిమనుషులే ఈ పనికి పాల్పడినట్లు గుర్తింపు

రాజేంద్రనగర్: ఇంట్లో పనికోసం వచ్చిన ఓ బిహార్ జంట అదును చూసి ఇంట్లోని విలువైన నగలు, నగదుతో ఉడాయించిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పనికి కుదిరిన 55 రోజుల్లోనే ఈ జంట దొంగతనానికి పాల్పడి ఉడాయించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడలోని మైఫీల్ టౌన్ విల్లా నంబర్ 20లో డాక్టర్ కొండల్ రెడ్డి (54) కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. గత నవంబర్ 1వ తేదీన ఏజెంట్ బిట్టు ద్వారా ఇంట్లో పనిచేసేందుకు బిహార్‌కు చెందిన నవీన్ కుమార్ యాదవ్, భారతిలను నెలసరి జీతంపై ఇంట్లో పనికి తీసుకొచ్చారు. తమ విల్లాలోని ఓ గదిని ఇచ్చి వారిని ఇంట్లోనే ఉండనిచ్చారు. ఈ క్రమంలో సోమవారం కొండల్‌రెడ్డి భార్య తన కుమారుల వద్దకు వెళ్లగా... కొండల్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లాడు. రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చిన ఆయన తన గదిలోకి వెళ్లి నిద్రించాడు. ఉదయం కొండల్ రెడ్డికి కాఫీ ఇచ్చేందుకు నవీన్ కుమార్ రాకపోవడంతో కొండల్‌రెడ్డి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కిందికి వెళ్లి చూడగా బయటి తలుపులు తెరిచి ఉండటంతో పాటు భార్యభర్తలిద్దరూ గదిలో కనిపించలేదు. ఇంట్లోని సీసీ కెమెరాలు పరిశీలించగా రాత్రి 8.52 గంటలకు భార్యభర్తలిద్దరూ బ్యాగ్‌లతో బయటికి వెళ్లినట్లు రికార్డు అయ్యింది. ఇంట్లోకి వచ్చి బీరువాను పరిశీలించగా..రూ.35 వేల నగదు, డైమండ్ బ్యాంగిల్స్, డైమండ్ రింగులు, రూబీ డైమండ్ నెక్లెస్, మంగళసూత్రం తదితర బంగారు వస్తువులు కనిపించలేదు. వీటి విలువ దాదాపు రూ.50 లక్షలు ఉంటుందని డాక్టర్ కొండల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. ఏజెంటు బిట్టు వద్ద భార్యాభర్తలిద్దరి వివరాలను సేకరించారు. నిందితులిద్దరూ రైలు మార్గం ద్వారా వెళుతున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ప్రత్యేక టీమ్ వీరిని పట్టుకునేందుకు పంపించినట్లు పోలీసులు వెల్లడించారు.

హయత్‌నగర్ కోర్టులో ఈ సేవ



ఈ సేవా కేంద్రం ప్రారంభోత్సవంలో జడ్జి శ్రద్ధసహిగల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్

వర్చ్యువల్‌గా ప్రారంభించిన హైకోర్టు జడ్జి అలోక్ ఆరాధే

అబ్దుల్లాపూర్‌మెట్: భవిష్యత్‌లో కేసులు ఈ ఫైలింగ్ చేయాల్సి ఉంటుందని.. అందుకు ఈ సేవ కేంద్రాన్ని వినియోగించుకోవాలని హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ అధ్యక్షుడు బొడ్డు భిక్షపతిగౌడ్ అన్నారు. మంగళవారం హయత్‌నగర్ కోర్టులో ఏర్పాటు చేసిన ఈ సేవ కేంద్రాన్ని రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే వర్చ్యువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 14వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఇన్‌చార్జి జడ్జి శ్రద్ధ సహిగల్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సంతోశ్‌కుమార్ గౌడ్, ట్రెజరర్ ఈశ్వర్ గౌడ్, మహిళా విభాగం కార్యదర్శి సరితారెడ్డి, క్రీడా కార్యదర్శి శివకుమార్, కార్యవర్గసభ్యులు నాగిరెడ్డి, రామ్మోహన్, సత్యనారాయణ, సైదిరెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు నాజర్ లక్ష్మీనర్సింహారెడ్డి, కోర్టు సూపరింటెండెంట్ శారద, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



ఆయుష్(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: బతుకుదెరువుకు మధ్యప్రదేశ్ నుంచి తల్లిదండ్రులతో కలిసి వచ్చిన బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం .. ఆదిబట్ల మున్సిపల్ పరిధి కొంగర కలాన్‌లోని ఐరా స్థిరాస్తి వెంచర్‌లో ఆయుష్(14) తల్లిదండ్రులతో కలిసి నివసించేవాడు. ఈ నెల 19న తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో బాలుడు ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలోనూ ఆయుష్ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చాడు. నాలుగు రోజులైనా బాలుడు రాకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ద్విచక్రవాహనదారుడు దుర్మరణం



అంగోత్ హరి(ఫైల్)

యాచారం: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై తక్కళ్లపల్లి తండా వద్ద చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తక్కళ్లపల్లి తండాకు చెందిన అంగోత్ హరి(45) మంగళవారం బైక్ పై యాచారం వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మాల్ నుంచి హైదరాబాద్ మార్గంలో ప్రయాణిస్తున్న ఓ కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో హరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య హరిత, ఇద్దరు కుమారులు సంతానం. కాగా కారు డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని హరి సంబంధీకులు ఆందోళన చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని.. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్
- 15 తులాల బంగారు ఆభరణాలు రికవరీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

షాద్‌నగర్ రూరల్: పగటిపూట రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లకు కన్నం వేస్తున్న నిందితుడిని షాద్‌నగర్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్‌ఐ శరత్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని విజయనగర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 23న ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చే వరకు తాళం పగులకొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలోని 18.1 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉండే మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టబోయిన్‌పల్లితండాకు చెందిన శివప్రసాద్(25)గా గుర్తించారు. పక్కా సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. నిందితుడి వద్ద నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. కేసు ఛేదించిన సిబ్బందిని అభినందించి రివార్డులు ప్రకటించారు.

ఒడిశా టు హైదరాబాద్

- ద్రవరూప గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టురట్టు
- రూ.12లక్షల విలువచేసే నాలుగు లీటర్ల హష్ ఆయిల్ స్వాధీనం
- నిందితులకు రిమాండ్



పోలీసులు రిమాండ్‌కు తరలించిన గంజాయి సరఫరా ముఠా సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: ద్రవరూప గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టురట్టయింది. అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి తెలిపిన ప్రకారం.. భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్న స్విఫ్ట్ కారులో నాలుగు కవర్లలో నిషిద్ధ హష్ ఆయిల్ ప్యాక్ చేసి ప్లాస్టిక్ డబ్బాలో పెట్టినట్లు గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన జయదేవ్, జితేందర్‌పంగీ, దేబా మడి, ఆకాశ్ సర్కార్ ముఠాగా ఏర్పడి అక్రమంగా గంజాయి సరఫరా చేసే వృత్తిని ఎంచుకున్నారు. ఒడిశాలో ద్రవరూపంలో ఉన్న గంజాయిని లీటర్‌కు రూ.1.20 లక్షలకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో డిమాండ్ నుబట్టి లీటర్‌కు రూ.3లక్షల వరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిపారు. తాజాగా ఒడిశా నుంచి భద్రాచలం వరకు ఒక వ్యక్తి గంజాయిని తీసుకురాగా.. అక్కడి నుంచి హైదరాబాద్‌లో సరఫరా చేసేందుకు వెళ్తున్న నలుగురు పోలీసులకు పట్టుపడ్డారు. వారి వద్ద నాలుగు లీటర్ల హష్ ఆయిల్, నాలుగు సెల్‌ఫోన్లు, ఓ స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకుని నిందితులను హయత్‌నగర్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ గంజాయిని వనస్థలిపురంలో చిన్న అనే వ్యక్తికి సరఫరా చేసేందుకు వెళ్తున్నట్లు చెప్పారని.. 2019లో జయదేవ్ ఒరిస్సా రాష్ట్రంలోని బలిమెల ఠాణా నుంచి గంజాయి కేసులో జైలు జీవితం గడిపినా.. బయటకు వచ్చి మళ్లీ అదే దందా చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.



షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం

నల్లగొండ జిల్లా కేంద్రంలో 43వ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. మంగళవారం పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా జట్టు క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేశారు.

నకిలీ పత్రాలతో ప్లాట్ల విక్రయం

ముఠాలోని ముగ్గురికి రిమాండ్



పోలీసుల అదుపులో నిందితులు

హయత్‌నగర్: నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్లు విక్రయిస్తున్న ఓ ముఠాను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మంగళవారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రీన్‌పార్క్ కాలనీకి చెందిన ముడావత్ దీప్లానాయక్, నందనవనం కాలనీకి చెందిన కేతావత్ పూల్‌సింగ్, అబ్దుల్లాపూర్ మెట్‌కు చెందిన మాచగోని రంగయ్య, బిరాదర్ మారతి, స్వామినాయక్, రమేష్‌నాయక్‌తో పాటు మరికొందరు ముఠాగా ఏర్పడ్డారు. చాలా కాలం ఖాళీగా ఉన్న, అభివృద్ధి చేయని ఇతరుల ప్లాట్లను గుర్తించి.. వాటికి సీసీ కాపీలు సంపాదించారు. వీటికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అమాయకులకు అంటగడుతున్నారు. వీరి వద్ద ప్లాటు కొనుగోలు చేసిన వాణిశ్యాంప్రసాద్ దంపతులు వీరి మోసాలను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విచారణలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధి గండిచెర్వులోని సర్వే నంబర్ 183, 186–189లోని పలు ప్లాట్లను.. పెద్ద సంస్థలకు సైతం విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు దీప్లానాయక్, పూల్‌సింగ్, రంగయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, మిగిలిన వారికోసం గాలిస్తున్నారు.

విద్యుదాఘాతంతో డ్రైవర్‌కు గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుదాఘాతానికి గురైన ఓ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లి ఏఎస్సై స్వరాజ్యం తెలిపిన వివరాల ప్రకారం... జలాల్ బాబానగర్‌కు చెందిన సయ్యద్ మొహ్మద్ ఆలీ(27) కామారెడ్డిలోని తులసీ ఇండస్ట్రీలో డీసీఎం డ్రైవర్. కాటేదాన్ పారిశ్రామికవాడ నుంచి సరుకులు సరఫరా చేస్తుంటారు. మంగళవారం సరుకు నింపుకునేందుకు కాటేదాన్ బుద్వేల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శ్రీరామ్‌నగర్ పరిశ్రమకు వెళ్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డీసీఎంను నిలిపాడు. అతి దగ్గరగా నిలిపి ఉంచడంతో డీసీఎంకు విద్యుత్ షాక్ తగిలింది. కిందికి దిగుతుండగా ఒక్కసారిగా విద్యుత్ ఘాతానికి గురై ఎగిరిపడ్డాడు.

మరోసారి తెరపైకి వివాదాస్పద భూమి కబ్జా

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని హెచ్‌ఎండీఏ, ప్రయివేటు వ్యక్తుల మధ్య ఉన్న వివాదాస్పద భూముల వ్యవహారం మరోమారు తెరపైకి వచ్చింది. సర్వే నంబరు 725 భూముల్లో హెచ్‌ఎండీఏ అవార్డును రద్దు చేసినట్లు ఇటీవల హైకోర్టు ధ్రువీకరించిన నేపథ్యంలో భూములు తమవేనంటూ కోర్టులో పోరాడుతున్న వ్యక్తులు సంబంధిత భూములను రెండురోజులుగా తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రవీందర్ దత్‌ను వివరణ కోరగా 'ఆ స్థలం విషయమై మహ్మద్ మోయినుద్దీన్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. హెచ్‌ఎండీఏ అవార్డును హైకోర్టు రద్దు చేసినట్లుగా కోర్టు ధ్రువీకరించడంతో ఆ స్థలం తమదంటూ స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. అయితే ఈ విషయం ఇంకా కోర్టు పరిధిలోనే ఉంది. వచ్చే నెల 6న విచారణ ఉంది. హైకోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా చర్యలుంటాయి.

1990 అవార్డు రద్దు చేశారు..

పట్టాదారులకు కాకుండా కౌలుదారులకు పరిహారం చెల్లించిన కారణంగా హెచ్‌ఎండీఏ 1990 అవార్డును గతంలోనే హైకోర్టు రద్దు చేసినట్లు ఇటీవల ధ్రువీకరించిందని పట్టాదారుల తరఫు న్యాయవాది మీడియాకు వివరించారు. పట్టాదారులపైనమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లు కోర్టులో క్వాష్ అయ్యాయన్నారు. కోర్టు ఇచ్చే తీర్పులను సంబంధిత విభాగాలు గౌరవించాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోనె సంచిలో తీసుకువచ్చి పడేసిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం... కాటేదాన్ దుర్గానగర్ చౌరస్తా నుంచి ఆరాంఘర్ చౌరస్తా వెళ్లే మార్గంలోని హ్యాపీ వైన్స్ ఎదురుగా ఉన్న వాలర్‌లెస్ డ్రైనేజీలో ఓ గుర్తుతెలియని మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించగా సుమారు 30– 35 సంవత్సరాల వ్యక్తిని ఎక్కడో హత్య చేసి ప్లాస్టిక్ గోనె సంచిలో తెచ్చి ఈ ప్రాంతంలో పడేసినట్లు గుర్తించామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.